# వింత మార్పు

మిట్ట పళ్ళ దాసరి ఏడ్చిందీ తెలియదు నవ్విందీ తెలియదూ అని పాత సామెత. ఏదో వేళాకోళానికి నేను సృష్టించిన సామెత కాదు. పాత పలుకు బళ్ళూ సామెతలూ అంటే మనసు పడే వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఏదో మార్జినల్ నోట్సులో వ్రాసుకున్న సామెత అని ఈ మధ్య ఎవరో, సాహిత్య గోష్ఠిలో చెప్పారు.

ఆ సామెత వినగానే సెక్షన్ హెడ్ శ్యామసుందరం చప్పున స్ఫురించాడు. మిడిగుడ్లూ మిట్టపళ్ళూ, నల్లని మబ్బు రంగూ అందులో నేరేడు పండు నిగారింపూ వున్న శ్యామ సుందరాన్ని చూస్తే పసిపిల్లలు కేర్‌మనే అవకాశం ఉంది. ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా, ఆశ్చర్యం వేసినా ఆనందంగా ఉన్నా తేడా తెలుసుకోవడం కష్టమే. కనుబొమలు మాత్రం ఏమీ సంబంధం లేనట్టు ఎగసి పడుతూ ఉంటాయి, అతనిలో ఏ ఉద్వేగం వచ్చినా. హావ భావాలు సరిగ్గా అంచనా వెయ్యలేక పొరపాట్లు కూడా జరుగుతూ ఉంటాయి. హుషారుగా ఉన్నాడనుకొని జోకులు వేసి పద చీవాట్లు తిన్నాడొక మారు అతని అసిస్టెంట్. అలాగని శ్యామసుందరుడు అనవసరంగా ఎవరి జోలికీ పోయే రకంకాదు.

అతని అసిస్టెంట్ల సాంకేతిక భాషలో చెప్పాలంటే అతనికున్న వీక్‌నెస్ అంతా ఒక్కటే-పంక్చుఆలిటీ. సరిగ్గా పది గంటలకు సీటులో కూర్చుని చేతి వాచీకి కీ ఇచ్చుకుంటూ (ఇంకా కొత్త రకం వాచీలు అతను గుర్తించలేదు) ఆలశ్యంగా వచ్చిన వాళ్ళను అదరగొడతాడు. కాస్త సీనియారిటీ ఉన్న మధ్య వయస్కులు ఏదో కుంటి సాకులు చెప్పుకుని ఆలశ్యంగా వస్తూనే ఉంటారు. కానీ ఏడాది సర్వీసు గట్టిగా లేని రాంబాబు కూడా ఈ మధ్య పది రోజుల నుండి ఆలశ్యంగా రావడం అతనిని బాగా కలవర పెట్టేసింది. ఎన్నడూ ఆలశ్యంగా వచ్చి ఎరగని బుద్ధి మంతుడనుకుని మురిసిపోతున్న రాంబాబు కూడా అలా చెయ్యడం సులభంగా స్వీకరించ లేక పోయాడు శ్యామసుందరం. అందుకే "నీ ఇల్లు ఎక్కడోయ్" అని జాడించాడు ఒక ఉదయం. రాంబాబు చెప్పిన సమాధానం విని 'నేను వచ్చే దారిలోనే. ఇంత దగ్గర ఉండి కూడా ఎందుకోయ్ ఆలశ్యం, నీ ఇంటి కన్నా మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటూ ఇంత బరువైన శరీరాన్ని మోసుకుని నేను రావడం లేదూ' అని మందలించాడు రాంబాబు సిగ్గు పడుతూ వెళ్ళిపోయి సీటులో కూర్చున్నాడే కాని ఆలశ్యానికి కారణం చెప్పలేదు. అదే శ్యామ సుందరానికి నచ్చలేదు.

రాంబాబు పెళ్ళాం సీతమ్మ కాదు. రాలుగాయి పిల్ల. పేరు రాజ్యలక్ష్మి. రాంబాబు ఈ మధ్య వాళ్ళ నాన్నగారు కాలం చేశాక ఊరికి పోయి తెచ్చుకున్న ఆస్తిని చూస్తే ఆమెకు అరికాలి మంట నెత్తికెక్కు తుంది. అసలే చిన్న కొంప అందులో ఒక గదిలో పాత గ్రామఫోన్ రికార్డులూ (లక్కవి), రికార్డు ప్లేయరూ ఒక పాత హార్మనీ పెట్టె తెచ్చి ఆ గది నింపేశాడు. తండ్రి బ్రతికిన రోజుల్లో ఎప్పుడు తండ్రీ కొడుకులు

కలిసినా పాత పాటలు కలిసిపాడుకోవడం, తండ్రి హార్మనీపెట్టె వాయిస్తే కొడుకు పాటలు పాడడం ఒక విచిత్రమైన వేడుక. పోనీ ఆ పాటలే మైనా కొత్తవా, తెలుగు పాటలా అంటే అవీ కాదు. భాష అర్థమై చావదు. అందులో పాత బాణీలు. ఇప్పుడు ఇంట్లోకి ఆ రికార్డులు మోసుకుని వచ్చి ఒహటే సర్దుకోవడం, టేపుల్లోకి ఎక్కించడం. "అన్నం వడ్డించేను చల్లారి పోతుందనో, ఆఫీసు టైమ్ అవుతోందనో హెచ్చరించ లేక చస్తున్నాను" అనుకుంటూ ఉంటుంది రాజ్యలక్ష్మి.

ఒక ఉదయం వీధి తలుపు మీద టక్ టక్‌మని కొట్టిన చప్పుడు. తలుపు తీసి కెవ్వుమని అరవబోయి తమాయించుకుంది రాజ్యలక్ష్మి. "ఏం తల్లీ, ఇది రామారావు అంటే, రాంబాబు ఇల్లే కదూ" అని అడిగి, కాస్త చనువుగా "ఉదయం పూట వేళకు అన్నం వండిపెట్టడం లేదా ? అమ్మాయీ ఎందుకు రోజూ ఆలశ్యంగా వస్తున్నాడీ మధ్య' అన్నాడు హడావిడిగా వచ్చిన శ్యామసుందరం. రోజూ రాంబబు వ్యవహారం గమనిస్తున్న రాజ్యలక్ష్మి ఇలాంటిదేదో జరుగుతుందని ఊహిస్తూనే ఉంది. జరగాలని కోరుకుంటూనే ఉంది కూడా. "రండి బాబాయ్‌గారూ ఆ గదిలో చూడండి ఆయన వాలకం. ఎప్పుడో భోజనం చెయ్యడం అయిపోయింది. ఆఫీసుకు వెళ్ళబోతూ ఏదో సవరింపులూ....గ్రామఫోను రికార్డులూ.. టేపులూ...." అని మరికాస్త వేడెక్కించింది - ఎంతో ఆనందంగా.

శ్యామ సుందరం నములుతున్న మసాలా కిళ్ళీ నోటిలో ఒక ప్రక్క నుండి ఇంకో ప్రక్కకు సర్దుకుంటూ "ఏం పాటలోయ్ అవి...." అన్నాడుమిడిగుడ్లు పెద్దవి చేస్తూ. ఈ అనుకోని పరిణామానికి

కలవరపడ్డ రాంబాబు "అబ్బే-ఏమీ లేదండీ, ఏవో మా నాన్నగారి పాత గ్రామఫోన్ రికార్డులు..." అని నసిగేడు. 'అవేవో చెప్పి ఏడవరాదూ' అని అడగ్గానే "కానన్ దేవీ, సురేందర్, కె.సీ.డే.... సైగల్, పంకజ్ మల్లిక్,.... జగ్‌మోహన్ ఖుర్షీదీ ..." అంటూ ఏకరువు పెడుతున్నాడు రాంబాబు. ఒక్కొక్క పేరు వింటూ కనుబొమలుసర్కస్ చేయిస్తూ ఆయాసంతో రొప్పుతున్నాడు శ్యామసుందరం. అతని ముక్కు పుటాలు కూడా ఎగురుతున్నాయి. రాజ్యలక్ష్మికి అది కోపమో, తాపమో ఆవేశమో పూనకమో అర్థం కాకుండా ఉన్న క్షణంలో "తస్సదియ్యా!—నీ ఇల్లు బంగారం గానూ....చెప్పి చావవేం. ఇంత విలువైన బంగారం రాశులు పోసుకుని నాకు చెప్పవేమిటోయ్. నేను ఈపాటలంటే పడిచస్తాననుకో. అసలు ఈ పాటలు రిలీజ్ అయిన రోజుల్లో నువ్వు మీ అమ్మ కడుపున కాదు కదా, ఆమె ఊహల్లోనైనా ఉన్నావా?.... భలే.... ఏమి టేస్టోయ్ మీ నాన్నగారిది...." అని రాంబాబుని అమాంతం కౌగిలించుకుని ఉక్కిరి బిక్కిరి చేశాడు. రాంబాబు కొండెక్కినంత సంతోషంతో "మా నాన్నగారు యూ.పీ.లో చక్కెర ఫ్యాక్టరీలో చాలా కాలం పని చేశారండీ. ఆయనకి హిందీ ఉర్దూ బాగా వచ్చు. గొంతు కూడా బాగుండేది...." అని జవాబిచ్చాడు.

ఆనందాన్ని సమంగా పంచుకోవడం వాళ్ళ ఇద్దరి వంతూ, అసూయ పడడం రాజ్యలక్ష్మి వంతూ అయింది. రాంబాబూ శ్యామసుందరాలు కలిసి మెలిసి తిరగడం పది నిముషాలైనా ఆలశ్యంగా తరుచూ ఆఫీసుకు పోవడం చూసి విస్తుపోవడం అందరి వంతూ అయింది.

—ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక